
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## పాతబిట్రగుంటలో కౌలురైతు ఆత్మహత్య



**బిట్రగుంట, మార్చి24, ప్రభాతవార్త:** బోగోలు మండలం పాతబిట్రగుంట గ్రామంలో శుక్రవారం కౌలురైతు పరుసు రమణయ్య (48) అనే కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల కదనంమేరకు రమణయ్య 11ఎకరాలు కౌలుకుతీసుకొని సాగు చేస్తున్నాడన్నారు. ఓవాణిజ్యబ్యాంకులో 6.5లక్షలు రుణంతీసు కొని పెట్టుబడిపెట్టి సాగుచేయగ అకాలవర్షానికి పంట పూర్తిగ దెబ్బతినడంతో అప్పులు చెల్లించలేమని నిరాశచెంది బహిర్భూమికనివెళ్ళి క్రిమిసంహారక గుళికలుమింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు మృతునికి ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉండగ ఇద్దరు కుమార్తెలకు అప్పులుచేసి పెళ్ళిచేశాడు. ప్రస్తుతం సాగుచేస్తున్న పంటలో ఆదాయం వస్తుందని ఎంతో ఆశతో ఉన్నప్పటికి ఆకాల వర్షానికి పంటదెబ్బతినడంతో ఈఘాతుకానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు బిట్రగుంట ఇన్‌చార్జ్ ఎస్.ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

## చిరుధాన్యాల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం

**కావలి రూరల్, మార్చి 24 ప్రభాతవార్త** చిరుధాన్యాల వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసిడిఎస్ ఇన్‌చార్జ్ పిడి సౌజన్య తెలిపారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని ముసునూరు గిరిజన కాలనీలో శుక్రవారం పోషణ పక్వాడా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడారు. సమతుల్యమైన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా జీవించాలన్నారు. తల్లిబిడ్డ ఆరోగ్యంగా వుండాలని తెలిపారు. గర్భకోశ వ్యాధి నిపుణురాలు మాలినిదేవి మాట్లాడుతూ గర్భవతులు అదనపు ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎసిడిపివో శారద, సామాజిక కార్యకర్త యం.మాలకొండారెడ్డి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థుల డీబార్

**నెల్లూరు, మార్చి24 ప్రభాతవార్త-విద్య** శుక్రవారం జిల్లాలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో అల్లూరు ఆర్‌కె జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను ఇంటర్‌బోర్డు పరిశీలకులు పి.సౌజన్య డీబార్ చేశారు. కాగా శుక్రవారం జరిగిన పరీక్షల్లో జనరల్ విద్యార్థులు 21381మంది జరల్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 21030 మంది హాజరైయ్యారు. 351మంది గైర్హాజరైయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1686మంది హాజరు కావాల్సి ఉండగా 1581మంది హాజరైయ్యారు. 105మంది గైర్హాజరైయ్యారు. పరీక్షల పరిశీలకులు, ఆర్‌ఐఓ టి.వరప్రసాదరావు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌బృందాలు, డివిఈఓ మధుబాబులు 71 కేంద్రాలను తనిఖీచేశారు.

## బిసి హాస్టల్ విద్యార్థులు ర్యాంకులు సాధించాలి



**సైదాపురం మార్చి 24 ప్రభాతవార్త** త్వరలో జరగనున్న పదోతరగతి పరీక్షలలో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బిసి సంక్షేమ సాధికారత అధికారి వై వెంకటయ్య తెలిపారు. మండలకేంద్రమైన సైదాపురంలో ఉన్న బిసి హాస్టల్స్‌కు సంబంధించి విద్యార్థులకు వార్డన్లు మస్తానయ్య, ఎస్ నారాయణ రావు ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ దేవి పూజ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలకు సంబందించి విద్యాసామాగ్రి అందించారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతు హాస్టల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో పాటు ర్యాంకులు సాధించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో నెల్లూరు డివిజన్ సహాయ బిసి సంక్షేమాధికారిణి కె ప్రసున్న, డాక్టర్ శేష, గ్రామ ఉపసర్పంచ్ బొలిగర్ల శివకుమార్ తదితరులున్నారు.

## ఘనంగా ప్రారంభమైన ఇంటర్నేషనల్ ఫర్నీచర్ ఎక్స్‌ఫో-2023

**నెల్లూరు, మార్చి24 ప్రభాతవార్త-విద్య** గత అనేక సంవత్సరాలుగా వినియోగదారుల మన్ననలను అందుకున్న అమ్మఫర్నిచర్ మాల్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని స్థానిక ముత్తుకూరుగేట్ సెంటర్‌లోని జిపిఆర్ కళ్యాణమండపంలో ఇంటర్నేషనల్ ఫర్నీచర్ ఎక్స్‌ఫో-2023 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా అమ్మ ఫర్నిచర్‌మాల్ ఫౌండర్ గడ్డం సుధాకర్‌రెడ్డి, సృజన్‌రెడ్డి, సుమన్‌రెడ్డిలతోపాటూ హోటల్స్ అసోసియేసన్ అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డిలు పాల్గొని రిబ్బన్ కట్‌చేసి లాంచనంగా ఎక్స్ ఫోను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతు నగర వాసులకు ఇతరదేశాలకు వెల్లకుండానే అక్కడ లభించే ఫర్నీచర్స్‌ను ఈ ఎక్స్‌ఫోలో 50శాతం రాయితీలతో అందించటం అభినందనీయమన్నారు. గత అనేక సవంత్సరాలుగా అమ్మ ఫర్నిచర్‌మాల్ వినియోగదారులకు నాణ్యమైన వస్తుసేవలను అందిస్తున్న అందరి ఆదరాభిమానాలను అందుకుందన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఎక్స్ ఫోలను మరిన్ని ఏర్పాటుచేయ్యాలని జిల్లావాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. నిర్వాహకులు గడ్డం సుమన్‌రెడ్డి, సృజన్‌రెడ్డిలు మాట్లాడుతు గృహ, కార్యాలయాలకు అవసరమైయ్యే టేబుల్స్, కాట్స్, బెడ్స్, టీపాయ్స్, డబుల్‌కాట్స్, డ్రస్సింగ్ టేబుల్స్, టివి యూనిట్స్, ఆఫీస్‌చైర్స్ ఇండి యన్, ఇంపోటెడ్ ఫర్నీచర్స్ అందుబాటులో ఉంచామన్నారు. 50శాతం డిసౌంట్స్‌తో ఈ అమ్మకాలను ఈనెల29వ తేదీ వరకు ఈ ఎక్స్‌ఫోలో సాగించనున్నామని పేర్కొన్నారు. నాణ్యతలో రాజీ వస్తువులను తక్కువదరలకు విక్రయిస్తున్నామని జిల్లావాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుని మర్యాదపూర్వకంగా కలిసిన బీద రవిచంద్ర



**నెల్లూరు మార్చి 24, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబునాయుడు ని ఉండవల్లి నివాసంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద.రవిచంద్ర కలిసి ఎమ్మె ల్సీ ఎన్నికల విజయంపై శుభాకాంక్షలు తెలియజే శా రు. త్వరలో శాసనమండలి పదవీకాలం పూర్తి చేసు కుంటున్న ఆయనను చంద్రబాబునాయుడు అభి నం దించాడు.

## నియామకపు ఉత్తర్వులు జారీ



**నెల్లూరు అర్బన్, మార్చి24, ప్రభాతవార్త** జిల్లా ప్రజాపరిషత్ నెల్లూరు యాజమాన్య పరిధిలో పనిచేస్తూ ఇదిని ర్వహణలో మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకము క్రింద సింగరవేలు మేరీగోల్డ్, కి మండల ప్రజాపరిషత్ కార్యాలయము కోవూరు నందు, అనుమాల ఇందిరకి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల బుచ్చిరెడ్డిపాలెం, మల్లరపు పద్మ, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విడవలూరు నందు ఆఫీస్ సభా ర్డినేట్‌గా నియమిస్తున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.చిరంజీవి ఓ ప్రకటనలో తెలిపారు. 24వ తేదీన జిల్లా ప్రజాపరిషత్ కారాటాలయం నందు జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ ఆనం ఆరుణమ్మ నియామ కపు ఉత్తర్వులు జారీ చేశారు.

## విష్ణాలయంలో పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు

**కావలి, మార్చి 24 ప్రభాతవార్త** కావలి పట్టణంలో వేంచేసి వున్న శ్రీ భూసమేత శ్రీ లక్ష్మీకాంత స్వామి ఆలయంలో(విష్ణాలయం) పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య అర్చకులు నారాయణం రామాచార్యులు తెలిపారు. ఏప్రిల్ 1వ తేది నుంచి 7వ తేది వరకు శ్రీ లక్ష్మీకాంతస్వామి వారికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడు రోజుల పాటు ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు, స్వామి వారికి గ్రామోత్సవాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు ఈ బ్రహ్మోత్సవాల వేడుకలలో పాల్గొని లక్ష్మీకాంత స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# ముగ్గరు ఎమ్మెల్యేలపై వేటు ... జిల్లాలో సంచలనం







**నెల్లూరు, మార్చి24, ప్రభాతవార్త** జిల్లాకు చెందిన వైసిపి అసంతృప్తి ఎమ్మెల్యేలు ఆనం రామానారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలపై అదిష్టానం సస్పెషన్ వేటు వేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. శుక్రవారం వైసిపి అదిష్టానం వీరిపై వేటు వేస్తున్నట్లు ప్రకటించడం జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. ఒకేసారి సీనియర్ శాసనసభ్యులపై చర్యలు తీసుకోవడం నెల్లూరు జిల్లాలో సంచలనం కలిగించింది. 1989తొలిదశలో అప్పటి సీనియర్ మంత్రి నల్లపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై ఎన్‌టిఆర్ వేటువేశారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలపై ఒకేసారి, ఒకేరోజు సస్పెషన్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనియాంశంగా మారింది. మాజీమంత్రి కాంగ్రెస్ పార్టీలో చక్రం తిప్పిన ఆనం రామనారాయణరెడ్డికి ఈ ఘటన పెను సవాలుగా మారింది. దశాబ్దాలు తరబడి నెల్లూరు రాజకీయాన్ని శాసించిన ఆనం కుటుంబానికి ఇది పరాబవంగా భావించారు. ఆయన సస్పెండ్‌పై ఆనం రామనారాయణరెడ్డి ఎటువంటి వాఖ్యలు చేయలేదు. 2019ముందు వైసిపిలో చేరి వెంకటగిరి నుంచి గెలుపొందారు. కరోనా సమయం, జిల్లా అధికారులు తనకి ప్రాధాన్యత ఇవ్వకపోవడం బహిరంగంగా వ్యాఖ్యానించారు. మంత్రులపై కూడా ఆయన విమర్శలు చేశారు. గత రెండున్నరేళ్ల నుంచి ఆయన అడపాదడపా ప్రభుత్వంపై విమర్శలు చేయడం జరుగుతోంది. ఈ దశలో వెంకటగిరి ఇన్‌చార్జిగా నేదురమల్లి రామకుమార్‌రెడ్డిని నియమించడం జరిగింది. దీంతో ఆయన అప్పటి నుంచి అదిష్టానంతో ఢీకొట్టారు. ఏ కార్యక్రమానికి హాజరు కాలేదు. శాసనమండలి ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థికి సహకరించారని అదిష్టానం సీరియస్‌గా భావించి పార్టీ నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. వైసిపి అదిష్టానం ముగ్గురు శాసనసభ్యులపై ఒకేసారి వేటువేయడం జిల్లాలో పెను సంచలనం కలిగించింది.

**స్వాగతిస్తున్నా: ఎమ్మెల్యే కోటంరెడ్డి**

తాను ప్రజలకోసం పని చేస్తానని ఇందుకు పోరాట మార్గమే ఉత్తమమని భావించినట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. తనను పార్టీ నుండి సస్పెండ్ చేయడం స్వాగతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అయితే పార్టీలో ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధంగా పరిణామాలు చోటుచేసుకున్నాయన్నారు. తనను సస్పెండ్ చేసేటప్పుడు షోకాజు నోటీస్ ఇచ్చి తన జవాబు ఇచ్చిన అనంతరం సస్పెండ్ చేస్తే బాగుండేదని అయినా తాను ఈ చర్యను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ప్రశాంతంగా ఉంది: మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి**

వైసిపి అదిష్టానం తనను సస్పెండ్ చేయడం పట్ల తనకు ప్రశాంతంగా ఉందని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తనకు డబ్బులు ఇచ్చే స్థాయి ఎవ్వరికీ లేదని స్పష్టం చేశారు. తాను ఇక ప్రశాంతంగా ఉంటానని తను బాధపడటంలేదన్నారు. మంచిచేసే వారికి కొందరు చెడు చేస్తారని తను జగన్‌కు మద్దతు ఇచ్చినందుకు ఇలా మర్యాద ఇచ్చారని వ్యాఖ్యానించారు. పార్టీ అధినేతల్లో మానవతాభావాలు అవసరమని గుర్తుచేశారు. ఈ క్షణమే తను రాజీనామా చేస్తా ఇక్కడ ఎవరు గెలుస్తారో తేల్చుకుందామని సవాల్ విసిరారు.

# క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

**నెల్లూరు మార్చి 24, ప్రభాతవార్త-వైద్యం** క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య సూచించారు. శుక్రవారం నగరంలోని సెయింట్ జోసఫ్ ఆసుపత్రి నుంచి సంతపేటలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయం వరకు జిల్లా క్షయ వ్యాధి అధికారి డాక్టర్ జి.వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్ఓ ఎం.పెంచలయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2022 ఏడాదిగాను సుమారు 40వేల మందికి ఉచితంగా గళ్ళ పరీక్షలు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా 3,804 మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, వీరికి చికిత్స అందించడంతోపాటు డిబిటీ ద్వారా నెలకి రూ.500లు చొప్పున రూ.3వేలు ప్రతి ఒక్కరికి వారి ఖాతాలో జమ చేశామన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బ్రిజిత, కావలి, ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మిత్ర, ఎంఓ, డిటిసి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, బొల్లినేని నర్సింగ్ కళాశాల, సుచరిత నర్సింగ్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేసిన



వారికి మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందచేసి సత్కరించారు.

# నూరుశాతం పన్నుల వసూళ్లే ధ్యేయం

**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** జిల్లాలోని అన్ని పంచాయతీలు చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా సంపదను సృష్టించుకుని తద్వారా పంచాయతీలను అభివృద్ధి పథంలో పయనింపజేసుకునేలా దృష్టి పెట్టాలని జిల్లా పరిషత్ సీఈవో బి. చిరంజీవి అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ చెత్త నుంచి సంపద కేంద్రాల్లో తయారయ్యే ఎరువుకు మంచి డిమాండ్ కూడా ఉందన్నారు. అదేవిధంగా గ్రామాల్లోని పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దబుష్టి సారించాలని పేర్కొన్నారు. దీంతో పాటు నూరుశాతం పన్నుల వసూళ్లపై చొరవ చూపాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపకుండా మార్చి నెలాఖరులోగా పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఆయన పంచాయతీలో రికార్డులు, రిజిస్టర్లు కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అశోక్‌కుమార్, తదితరులు ఉన్నారు.



# పంట నష్టాన్ని పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

**కావలి, మార్చి 24 ప్రభాతవార్త** గురువారం ఉరుముల, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల్ని శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి జి.సుధాకర్‌రాజా పరిశీలించారు. కావలి మండలంలోని కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించి దెబ్బతిన్న, ముంపుకు గురైన వరి పంటను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాలలో స్థానిక రైతులతో చర్చించారు. నిన్న కురిసిన వర్షపాతం 39 మిల్లీమీటర్లు వుందన్నారు. కొన్ని పొలాల్లో విత్తనాలకు మొలకలు వస్తున్నాయన్నారు. నష్టం 33 శాతం వుందన్నారు. రైతులకు హెక్టార్‌కు వరి పంటకు 15 వేలు నష్టం ప్రభుత్వం అందిస్తుందన్నారు. దెబ్బతిన్న పంట నష్టాల వివరాలను తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు వెంట కావలి ఎడిఎ కె.కన్నయ్య, వ్యవసాయాధికారిణి ఎ.లలిత, విఎఎ బలరాం, తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షానికి నట్టేట మునిగిన రైతు

**బిట్రగుంట, మార్చి 24 ప్రభాతవార్త** బోగోలు మండలంలో గత వారం రోజుల నుంచి ప్రకృతి సానుకూలంగా లేకపోవడంతో అకాల వర్షానికి మండలంలోని రైతాంగం నట్టేట మునిగింది. మండలంలో అన్ని గ్రామాలలో 70 శాతంకు పైగా పంట పండిన ధాన్యాన్ని కోశారు. అకాల వర్షానికి కోసి ఎండబెట్టిన ధాన్యం తడిచిపోవడంతో పాటు, కోయని పంట నీట మునిగిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ముందుగానే రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో సర్వర్లు ఓపెన్ కావడం లేదు. దీంతో



ఒక్క గింజ కూడా రైతుల వద్ద కొనుగోలు చేయలేదు. దీంతో వాతావరణంలో మార్పులకు రైతులు భయపడి దళారుల ద్వారా విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దళారులు ఇదే అదనుగా చేసుకొని ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు తగ్గించి పుట్టికి 3 వేల నుండి 4 వేలు వరకు కోత విధించి రైతులను దగా చేసి దోచుకుంటున్నారు. రైతులు పండించిన పంటను ఆరబెట్టేందుకు సదుపాయలు లేకపోవడంతో వాతావరణంలో మార్పులకు ఆందోళన చెంది ఖర్చులైనా గిట్టకుపోతాయానని దళారులకు విక్రయిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికపై ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## నందవరం హైస్కూల్లో సరస్వతీపూజ

**మర్రిపాడు, మార్చి24(ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం నందివరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాఉయలు సి.హెచ్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో చదువుల తల్లి సరస్వతీదేవికి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅ తిథులుగా పూర్వ ఉపాధ్యాయులు, ఉన్నతపాఠశాల స్థలం దానం చేసిన దాత స్వర్గీయ ఎక్కులూరి రామసుబ్బారెడ్డి సతీమణి ఎక్కులూరి రామమ్మ పాల్గొన్నారు. ఆమెను ఉపాధ్యాయులు శాలువాలు , పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ముందుగా ఉపాధ్యాయులు విద్యార్థులు సరస్వతీదేవి విగ్రహాన్ని పూలతో అలంకరించి , సరస్వతీదేవి వద్ద హాట్‌టిక్కెట్లను ఉంచి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ విద్యాసంవతసరం ఉన్నతపాఠశాలలో 10వ తరగతి చదివే పిల్లలందరూ ఉత్తీర్ణులు కావాలని ఆసరస్వతీదేవిని వేడుకున్నారు. పాఠశాలకు స్థలాన్ని బహూకరించిన దాత స్వర్గీయ ఎక్కులూరి రామసుబ్బారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా ఆయన సతీమణి రామమ్మ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలో 10వ తరగతి చదువుకునే విద్యార్థులు అందరూ మంచి ఫలితాలు రాణించి పాఠశాలకు ,తమ తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## చుంచులూరు ఉన్నతపాఠశాలలో ఘనంగా సరస్వతీపూజ



**మర్రిపాడు, మార్చి24(ప్రభాతవార్త:**మండలంలోని చుంచులూరు ఉన్నతపాఠశాలలో సరస్వతీ పూజనిర్వహించారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహి ంచారు. కీ.శే.దువ్వూరు రామ్మోహన్ జ్ఞాపకార్థం వారి సతీమణి భవాని, ఆయన కుమారులు సురేష్ , మల్లిఖార్జున , వారి కుటుంబ సభ్యులల ధాతృత్వంతో సరస్వతీ పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, గ్రామస్తులకు భోజన కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు పరిక్షా సమాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు అందరూసరస్వతీదేవి అనుగ్రహంతో మంచి ఫలితాలు సాధించాలన్నారు. చుంచులూరులో దాతలకు కొదవలేదని, దాతలు పాఠశాల అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. ఈసందర్భంగా పాఠశాలకు సహకరిస్తున్న దాతలను ఘనంగా సన్మానించారు.అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈకార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జొన్నా సత్యనారాయణ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కలిశెట్టి వెంకటరమణయ్య, ఉపాధ్యాయురాలు కంచి అరుణ, దవ్వూరు భవాని, కలిశెట్టి రాజేంద్రకుమార్, తంగేడుపల్లి సుబ్బయ్య, పాఠశాల ఉపాధ్యాయులు కర్రావుల రమణయ్య, అశోక్, రేవతి, వెంకటరెడ్డి, మురళీకృష్ణ, రబ్బాని , సురేంద్ర, మాధవరావ్, ఓబయ్య, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చు

**వేపినాపి(రాపూరు),మార్చి24(ప్రభాతవార్త:** క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చుని రాపూరు మండలంలోని వేపినాపిప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సూర్యధర్మేంద్ర తెలిపారు. జాతియ క్షయ వ్యాధి నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకోని శుక్రవారం వేపినాపి గ్రామంలో క్షయవ్యాధిపై అవగాహనా ర్యాలిని ఆయన వైద్య సిబ్బందితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, రెండు వారాలకు మించి తగ్గని జ్వరం, క్రమంగాబరువు తగ్గడం వంటి లక్షణాలు వుంటే అధి క్షయవాధి లక్షణం కావచ్చున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం సమీపంలోని ప్రభుత్వఆసుపత్రిలో గళ్ల పరిక్ష నిర్వహించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో వేపినాపి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హెల్త్ సూపర్‌వైజర్‌లు,ఆరోగ్య కార్యకర్తలు,ఆశాలు పాల్గొన్నారు.

## మంచి పౌష్టికాహారం ద్వారా త్వరితగతిన బిడ్డల ఎదుగుదల

**మిట్టపల్లి(రాపూరు),మార్చి24(ప్రభాతవార్త:** మంచి పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా త్వరితగతిన బిడ్డలు ఎదుగుతారి వేపినాపి సెక్టార్ సూపర్‌వైజర్ శారదా దేవితెలిపారు. పోషణ్ ఫక్వాడా కార్యక్రమంలో భాగంగా రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సునంధా అదేశాల మేరకు వేపినాపిసెక్టార్ పరిధిలోని చుట్టుపాళెం, నాయినపల్లి,మిట్టపల్లి గ్రామాల పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శారదా దేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో క్రమం తప్పకుండా పిల్లలబరువు,ఎత్తు చూడటం జరుగుతుందన్నారు. వీరిలో బరువు, ఎత్తు తక్కువ వున్న పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆందజేయడం జరుగుతు ందన్నారు. ప్రతిరోజు మంచి ఆహారం తీసుకుంటూఆరోగ్యంగా వుండాలని ఆమె గర్భవతులకు, బాలింతకు, సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మురారీ,చుట్టుపాళెం,నాయినపల్లి,మిట్టపల్లి అంగన్‌వాడీ కార్యకర్తలు, యశోధ రత్నమ్మ,మాధురి,అశావర్కరు సునీత, ఆయా అంగన్వాడీ కేంద్రాలపరిధిలోని గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణ పట్ల బిజెపి నిర్లక్ష్య వైఖరి

**పొదలకూరు మార్చి 24 (ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అవుతున్న ఎస్‌సి వర్గీకరణ పట్ల మాదిగల పట్ల నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తుందని ఎంఆర్‌పిఎస్ యువసేన జిల్లా నాయకులు పల్లిపాటి వెంకటేష్ మాదిగ ఆరోపించారు. బిజెపి పార్టీని మాదిగ పల్లెలోకి రానివ్వకుండా తరిమికొడతామని అన్నారు. మంగళపూరు సురేష్‌మాదిగ మాట్లాడుతు వెంకటగిరి నుండి ప్రారంభం అయిన పాదయాత్ర దక్కిలి,రాపూరు శుక్రవారం దేగపూడికి చేరుకుందని అధికారంలో వచ్చే వంద రోజులలో వర్గీకరణ చేస్తామని చెప్పినా బిజెపి పార్టీ ఇప్పటికి నేరవేర్చలేదని అన్నారు. ఇందుకు నిరసనగా రాబోయే రోజులలో ఎంఆర్‌పిఎస్‌ఎంఎస్‌పి అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆయన ఆదేశానుసారం బిజెపిని గ్రామాలలోకి రానివ్వకుండా అడ్డుకుంటామని అన్నారు.ఈ సందర్భంగా చిడదల శ్రీనివాసమాదిగ మాట్లాడుతు బిజెపి పార్టీ బహిరంగ సభలో మాదిగ ఉపకులాలో వినతి పత్రం ఇవ్వడానికి వెళితే అక్కడ ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు,బిజెపి కార్యకర్తలు మాదిగల మీద దాడి చేశారని అన్నారు.ఖచ్చితంగా దీని ప్రతికారం తీర్చుకుంటామని ఆంధ్రప్రదేశ్‌లోని మాదిగపల్లెలో అడుగు పెట్టనివ్విబోమని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పల్లిపాటి వెంకటేష్‌మాదిగ,గార్లపెంచలయ్య మాదిగ, గార్లజశ వ్ంత్‌మాదిగ ,చాట్ల జయమ్మ మాదిగ, చాట్ల రమణమ్మ మాదిగ, చాట్ల సంపూర్ణమ్మ మాదిగ,తదితరులు పాల్గొన్నారు.చెప్పాలని ఆయన కోరారు.

## నేడు ఉగాది పురస్కారాల ప్రధాన సత్కారం

**నెల్లూరు కార్పొరేషన్, మార్చి24,(ప్రభాతవార్త**నెల్లూరు నగరంలోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకుల ఆధ్వర్యంలో 30మంది ఉగాది పురస్కారాలనుప్రధానం చేయనున్నట్లు సృజన సాహిత్య,సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు.శనివారం సాయంత్రం 4గంటల నుంచి 9గంటల వరకు ఈ పురస్కారాల కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నానరు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిధులుగా విజయడైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి,నగర డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి,ఏపి జెన్కో కొలు శ్రీనివాసరావు,నగర ట్రాఫిక్‌క సిఐ నాగేశ్వరమ్మ కృష్ణపట్నం సీఐ వేమారెడ్డిలు ఉగాది పురస్కారాల ప్రధాన సత్కారాలను చేస్తారని ఆ ప్రకటనలో దగ్గుపాటి రాధాకృష్ణ పేర్కొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి24,(ప్రభాతవార్త:** నగరంలోని ఆర్టీసీ సమీపంలో గల యాష్ పార్క్ హోటల్ నందు రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉగాది పురస్కారాలు ఘనంగా నిర్వహించారు.అందులో భాగంగా సేవా తత్పరులైన కొందరికి ఉగాదిపురస్కారాలు అందజేశారు.నగరానికి చెందిన శ్రీ పాండురంగ అన్నదాన సమాజం ఉపాధ్యక్షుడు గాను శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంకమిటీ మెంబర్ గాను ఎన్నోసేవలు అందించడమే కాకుండా ప్రతిఏటా ముక్కోటిఏకాదశి, ఉగాదినాడు శ్రీ రాంగనాథస్వామి దేవస్థానం నందు జై శ్రీరామహనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో అతిపెద్ద భారీ ప్రసాద వితరణ చేస్తున్నందుకు గాను పాదర్తి బాలాజీని రోటరీ క్లబ్ ప్రతినిధులు సత్కరించి అవార్డు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయడం అంటే తనకెంతో ఇష్టమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ గవర్నర్ వొమ్మిన సతీష్,ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి,సెక్రటరీ శ్రీహరి,రోటరీ సభ్యులు గోధంశెట్టి గోపాల్,గురవయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాపూరులో రేపు స్థానిక సంస్థల యంఎల్‌సీ మేరిగ మురళీధర్‌కు పౌరసన్మానం



**రాపూరు, మార్చి24(ప్రబాతవార్త:** ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల యంఎల్‌సిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మేరిగ మురళీధర్‌కు ఆదివారం రాపూరులోపౌరసన్మానానికి వైసిపి నాయకులు భారీ సన్నాహాలు చేస్తున్నారు. యంఎల్‌సీగా గూడూరు నియోజకవర్గం నుండి మేరిగ మురళీధర్‌కు అవకాశం కల్పించినప్పటికి మురళీధర్ స్వస్థలం రాపూరు కావడంతో ఆయనకు పెద్ద ఎత్తున పౌర సన్మానంకార్యక్రమాన్ని రాపూరులోని సి.వి.కె. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ కళశాల ప్రాంగణంలోనే గతంలోఉన్నత పాఠశాల,ఇంటర్‌మీడియట్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వుండగా యంఎల్‌సీ మురళీధర్ విద్యాభ్యాసం సుమారు10 సంవత్సరాల పాటు ఈ కళాశాల ప్రాంగణంలోనే ఆయనకు పౌర సన్మానం నిర్వహించడం విశేషం. ఈ పౌరసన్మానానికితిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు,రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్ మెంట్ బోర్డు ఛైర్మన్,వెంకటగిరి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్తనేదురుమల్లి రాంకుమార్ రెడ్డితో పాటు,రాపూరు మండల వైసిపి నాయకులు పాపకన్ను సోదరులైన మాజీ ఏయంసీ ఛైర్మన్‌పాపకన్ను మధుసూధన్ రెడ్డి, పాపకన్ను దయాకర్ రెడ్డిలతో పాటు, పలువురు వైసిపి ముఖ్యనాయకులు కూడా హజరు కానున్నారు.భారీ స్థాయిలో పౌరసన్మానానికి ఏర్పాట్లు యంఎల్‌సిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తరువాత తొలిసారి సోంత ఊరైన రాపూరుకు వస్తున్న మేరిగ మురళీధర్‌కుభారీ స్థాయిలో స్వాగతం పలికేందుకు వైసిపి నేతలు,పాపకన్ను అనుచరులు,మేరిగ అనుచరులు ఏర్పాట్లు చేస్తున్నారు.40 సంవత్సరాల తరువాత చట్టసభలకు రాపూరు వాసీసుమారు 40 సంవత్సరాల తరువాత చట్టసభ అయిన శాసన మండలిలో రాపూరు మండలానికి చెందిన మేరిగ మురళీధర్ యంఎల్‌సీగా అడుగు పెట్టనున్నారు. 1983లో తెలుగుదేశం పార్టీ తరపున రాపూరు నియోజక వర్గ శాసన సభఎన్నికలలో రాపూరు మండలం గుండవోలు గ్రామానికి చెందిన మల్లిరెడ్డి అదినారాయణ రెడ్డి విజయం సాధించి రాష్టశాసన సభలో శాసనసభ్యునిగా అడుగు పెట్టారు.అనంతరం శాసనసభ ఎన్నికలలో పోటీ చేయాలని రాపూరు మండలంలోని పలువురు నాయకులు అనుకున్నపట్టికి వారికి ఆ అవకాశం రాలేదు. తిరిగి 40 సంవత్సరాల సుధీర్ఘకాలం తరువాత యంఎల్‌సిగా మేరిగ మురళీధర్‌రాష్ట్ర శాసన మండలిలో అడుగుపెట్టనున్నారు. దీంతో ఈ మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో వెనుకబడివున్న రాపూరు మండలంలో నెలకోని వున్న అనేక సమస్యలను ఉన్నత విద్యావంతుడైన మేరిగ మురళీధర్ చట్టసభల దృష్టికి తీసుకువెల్లి రాపూరు మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలని మండల వాసులు అకాంక్షిస్తున్నారు.

## బాలుర ఉన్నతపాఠశాలలో సరస్వతీ పూజ



**వింజమూరు, మార్చి24 (ప్రభాతవార్త:** వింజమూరు లోని బాలుర ఉన్నతపాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య ఆధ్వర్యంలో సరస్వతీపూజను నిర్వహించారు. పాఠశాలలో కొలువు దీరి ఉన్న సరస్వతీదేవికి ప్రత్యేక అర్చనలు , అష్టోత్రాలు చేసి చదువులతల్లి సరస్వతీదేవికి కొబ్బరికాయలు సమర్పించి త్వరలో తాము వ్రాయబోయే పరిక్షల్లో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి చదువుతున్న 204మంది విద్యార్థిని, విద్యార్థులు పరిక్షల సమయం దగ్గరవుతున్న దృష్ట్యా ఏకాగ్రతతో, పట్టుదలతో చదువును అభ్యసించాలన్నారు .పరిక్షల సమయంలో ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా అర్థంచేసుకొని సమాధానాలు వ్రాయాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మూగజీవాల దాహార్తిని తీర్చిన కాకర్ల



**వింజమూరు, మార్చి24(ప్రభాతవార్త:** మండలంలోని గుండెమడకలలో వేసవికాలంలో తాగునీటి వనరులు మృగ్యమై దప్పికతో అలమటిస్తున్న మూగజీవాలకు కాకర్ల చారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకర్ల సురేష్ సహృదయంతో గ్రామస్తుల విన్నపం మేరకు రెండు బోర్లను ఏర్పాటు చేయించారు. గ్రామంలో 250మందికి పైగా జీవాలను పెంచుతూ దాన్నే వృత్తిగా చేసుకొని కుటుంబ పోషణ సాగిస్తున్నారు .ఎండాకాలంలో జీవాలకు తాగునీరు లేక వాటి పెంపకం కష్టతరమవుతుండేది. ఇటీవల వారి గ్రామానికి వెళ్ళిన కాకర్ల సురేష్‌కు జీవాల యజమానులు విన్నవించగా కాకర్ల స్పందించి రెండు చేతి బోర్లను , నీటిని నిల్వ చేసుకునేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయించారు. శుక్రవారం అట్టహాసంగా గ్రామస్తుల సమక్షంలో వాటిని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్రాల శ్రీనివాసులుయాదవ్, గాలి రామ్మోహన్‌నాయుడు, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి , గాలి నరసపనాయుడు, దారపనేని సుబ్బానాయుడు, కర్ణం సింహాద్రినాయుడు, చెరుకూరు చంద్రమౌళినాయుడు, ఆనాటి కొండలరావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సరస్వతీ పూజ

**చేజర్ల, మార్చి24(ప్రభాతవార్త:** మండలంలోని ఆదూరుపల్లి, నాగులవెలటూరు, చేజర్లలో శుక్రవారం సరస్వతీపూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులందరూ కలసి సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజాదికార్యక్రమాలను నిర్వహించారు. గణపతిపూజ , కలశపూజ, సరస్వతీదేవి పూజ నిర్వహించారు. విద్యార్థులందరికీ ప్రసాదాలను పంచిపెట్టారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు . చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రవేటు పాఠశాలలకు ధీటుగా పూజా కార్యక్రమాలు, సాంస్కృతికకార్యక్రమాలను నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పేరెంట్స్‌కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. 10వ తరగతి పరిక్షలు దగ్గర పడడంతో ఈ ఏడాది 10వ తరగతి పరిక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులందరూ చక్కగా పరిక్షలు వ్రాసి మంచి భవిష్యత్తును సాధించాలని కోరుకుంటూ ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదూరు పల్లిలో ప్రధానోపాధ్యాయులు గుడుగుంట శేషగిరిరావ్, నాగులవెలటూరు, చేజర్లలో ప్రధానో పాధ్యాయినిలు బొల్లా శైలజ, పులుసు హైమావతిలు , పేరెంట్స్‌కమిటీ ఛైర్మెన్ల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## రావూస్‌లో ప్రాంగణ ఎంపికలు



**నెల్లూరు, మార్చి24 (ప్రభాతవార్త-విద్య:** నగరంలోని స్థానిక రావూస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బైజూస్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర వ్హహించింది. ఎంపికలను హాజరైన అభ్యర్థులను సంస్థ హెచ్‌ఆర్ టి.దుర్గాప్రసాద్ ఇంటర్వ్యూస్, గ్రూపుడిస్కషన్స్ నిర్వహించిన ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రావూస్ విద్యాసంస్థల డైరెక్టర్ వై.శివస ంకేత్ మాట్లాడుతు తమ విద్యార్థులను ఉద్యోగులుగా తయారు చేసేందుకు అన్నీ చర్యలు తీసకున్నామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఈఓ శివారెడ్డి, సిబ్బంది దిలీప్, మఖబూల్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో శక్తి సామర్ధ్యాలు పెంపు

**బుచ్చి మార్చి 23 (ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని శాంతినగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాంలో సూపర్‌వైజర్ శకుంతల ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కౌన్సిలర్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.ఈకార ్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని ఆయన ప్రశంసించారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతుఈ కార్యక్రమం మార్చి 20 నుండి ఏప్రిల్ 3 వ తేది వరకు జరుగుతుందని సూపర్‌వైజర్ తెలిపారు. చిరుదాన్యాల గురించి వాటి ప్రాధాన్యత గురించి తల్లులకు అవగాహన వివరించారు. పోషకాహార లోపం మరియు రక్తహీనతకు గురికాకుండా ఉండాలంటే చిరుధాన్యాలతో చేసిన రకరకాల ఆహార పధార్ధాలు తినాలని ఆమె సూచించారు.చిరుదాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్ధాలు తింటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అధికమైన పోషకాలు పొందవచ్చునని తద్వారా గుండె జబ్బులు, మదుమేహం, మలబద్ధకం,పెద్దప్రేగు క్యాన్సర్ రాకుండా నిరోదించవచ్చునని చెప్పారు.శక్తి స్థాయిలను పెంచుట కండరాల వ్యవస్థను బలోపేతం చేయడానికి చిరుధాన్యాలు బాగా ఉపయోగ పడుతాయని తల్లులకు అవగహన కల్పించారు. చిరుధాన్యాలతో ఫుడ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ సెంటర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పదార్ధాలు వృధా చేయవద్దని ఆమె సూచించారు.ఈకార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు మహిళాపోలీస్, ఆయాలు ,ఆషా వాలింటర్ పాల్గొన్నారు.

## ఎన్‌ఎంఎంఎస్ సాధించడం హర్షణీయం



**చేజర్ల, మార్చి24(ప్రభాతవార్త:** చేజర్ల మండలం నాగులవెలటూరులోని బొద్దులూరు సుబ్బరామానాయుడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం సంతోషకరంగా ఉందని నాగులవెలటూరు అభివృద్ధి ప్రధాత వేలూరు కేశవచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలోని విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయిని ఘనంగా కేశవచౌదరి ఆయన సతీమణి రేవతిలు సన్మానించారు. ప్రతి ఏటా ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యేలా ఉపాధ్యాయులు క ృషి చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బొల్లా శైలజని శాలువా, మెమొంటోలతో సత్కరించారు. మండలంలో 7మంది విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కాగా అందులో నలుగురు నాగులవెలటూరుకు చెందిన విద్యార్థులే కావడం సంతోషమని కేశవచౌదరి పేర్కొన్నారు. నూతక్కివారి కండ్రికలో ఒకరు, చేజర్లలో ఒకరు, మాముడూరు ఉన్నతపాఠశాలలో ఒకరు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు.

## జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జేసీకి వినతిపత్రం



**నెల్లూరు అర్బన్, మార్చి24, (ప్రభాతవార్త:** రాష్ట్రంలో అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు.నెల్లూరుజిల్లా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలం బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార ్యక్రమంలో బిజెపి కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొని రాష్ట్రంలోని మరియు నెల్లూరు జిల్లాలోని పటంనష్టంపై వివరించారు.కోత దశకు వచ్చిన వరిపైరు ఈ వర్షాలకు దెబ్బతినడం జరిగింది.అలాగే ఉద్యానవన పంటలు మామిడి,నిమ్మ లాంటి పంటలలో పూతరాలిపోవడం జరిగింది.మెట్టపైర్ల మినుము,పెసర,పోగాకు పంటలరైతులు నష్టపోవడం జరిగింది. నెల్లూరు జిల్లాలో ధాన్యం మద్దతు ధర 17,500రూ ఉండగా యన్‌ఎల్‌ఆర్34449 రకం దాన్యం ధర 14వేల రూపాయలకు పడిపోయింది.గత రెండు రోజులక్రితం వరకు కూడా నెల్లూరుజిల్లాలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు కాకపోవడం పట్ల బిజెపి నేతలు అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌ఎన్‌ఆర్15048 రకం దాన్యం ధర మద్దతు ధర కంటే మూడువేల రూపాయలు తక్కువకు విక్రయాలు చేస్తున్నారు. మండల స్థాయిలో ధాన్యాన్ని ఆరబెట్టుకుని డ్రయర్ల ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. తడిచిన ధాన్యాన్ని పత్తి పొగాకు పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నమామీ గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్,కిసాన్ మోర్చా నేతలు చక్రవర్తి సుబ్బారావు ప్రముఖుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జేసీకి వినతిపత్రం



**నెల్లూరు అర్బన్, మార్చి24, (ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తిక్కన ప్రాంగణంలో నెల్లూరు రూరల్‌కు సంబంధించిన రెవెన్యూ సమస్యల మీదా ప్రత్యేక గ్రీవెన్స్‌లో నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌ని కలిసి అంబాపురం నవాజ్‌ఖాన్ పేట భూములుమీదా వివరణ ఇచ్చిన తరువాత సర్వే చేయాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు.ముస్లిం ఫెడరేషన్ ఆఫ్‌ఆంధ్రప్రదేశ్ మరియు ముస్లిం మైనారిటీ ఆర్గనైజేషన్ల ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగానిరసన కార్యక్రమం నిర్వహించారు.పోలీసులు కలెక్టర్ కార్యాలయంలో నిరసన కారులను ప్రవేశించకుండా అడ్డగించారు.నెల్లూరు కొత్తూరు అంబాపురంలో నవాజ్‌ఖాన్ పేటలో ఉన్న భూములు ముస్లిం మైనారిటీలకుసంబంధించినది.బ్రిటీష్ ప్రభుత్వం 1923చట్టం ప్రకారం ఈ భూములు ముస్లిం మైనారిటీలకు సంబంధించిందనిరికార్డు చేయడం జరిగింది.ద ఫ్రంట్ ఆఫ్ సైంట్ జీఆర్డ్ 1951సంవత్సరములో సెప్టెంబర్ 1వ తేదీ మద్రాస్ ప్రభుత్వంలో ఈ భూములు ముస్లిం మైనారిటీల భూములు అని గెజిట్ నోటిషికేషన్ విడుదల చేశారు. ఇంకొకసారి1960సంవత్సరంలో అక్టోబర్ 16వ తేదీన ప్రభుత్వమూ గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. 10సంవత్సరాలుగా దీని చరిత్ర ఉంది.ఈ భూములు ముస్లిం మైనారిటీలకు సంబంధించినది అని పూర్తిగా నిర్ధారించారు.2008లో ఈ భూములు మైనారిటీల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది,అనేక సార్లు ఈ భూములు అన్యాక్రాంతం చేసేదాన్ని దుర్మార్గులు ప్రయత్నిస్తూనే ఉన్నారు.మరి ఇన్ని రికార్డులు ఉన్నా తరువాత ఈభూములు వదిలేది లేదు ఎన్ని అడ్డంకులు సృష్టించినా త్యాగాలు చేసి మా భూములు మేము స్వాధించుకుంటాము.మొహమ్మద్ జియాఉల్ హక్ రాష్ట్ర అధ్యక్షులు,ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మౌలానా అబ్దుల్ అజీజ్,ఇన్ సాఫ్ అజీజ్ అహమద్, కాంగ్రెస్ అల్లావుదీన్, షాహుల్, గౌస్‌బాషా, రెహ్మాన్, షఫీ,రఫీ, హాఫీజ్‌ఉల్లా, ముజాహిద్, ముజీబ్, జమీర్, నజీర్, షబ్బీర్,షఫీ స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వందే భారత్ రైళ్ల తయారీపై వివరాలు కావాలి



**నెల్లూరు సిటీ, మార్చి24, (ప్రభాతవార్త:** 200వందేభారత్ రైళ్లను తయారీ బిడ్ వివరాలు తెలపాల్సిందిగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు.పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ ఈ వివరాలను సంబంధిత మంత్రిని కోరారు.వందేభారత్ రైళ్ల తయారీ బిడ్ రషా ్య కంపెనీ గెలుచుకున్న విషయం వాస్తవమయితే వివరాలు కావాలన్నారు.రషా ్య,ఉక్రెయిన్ మధ్య పరిణామాల ప్రభావంపై వివరణ కోరారు.ఇందుకే కేంద్రమంతి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ రష్యా,30.11.22న భారతీయ ప్రమాణాల ప్రకారం 200వందే భారత్ రైళ్ల తయారీకి సంబంధించిన టెండర్‌లో పాల్గొందన్నారు.ఈ టెండర్ మూల్యాంకనం(నిర్ధారణ)దశలో ఉందని తెలిపారు.అనంతరం మత్స్య సంపద,సర్వే వివరాలు తెలిపాల్సి ందిగా సంబంధిత శాఖను కోరారు.ఇంటరాక్షన్ వర్క్‌షాపులు,మారిటైమ్‌ఎగ్జిబిషన్‌లు తదితర అంశా ల వివరా లు కావాలన్నారు.ఇందుకు స్పందించిన కేంద్రమంత్రి పర్షోత్తం రూపాలా లిఖితపూర్వక సమాధానం ఇస్తూ గత 5ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ తీరం వెంబడి ఎఫ్‌ఎస్‌ఐచే నిర్వహించబడిన మత్స్య వనరుల సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ తీరంలో మత్స్యశాఖ సర్వే కార్యకలాపాలు ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం నుంచి కమి టి వరకు చేపట్టడం జరిగిందన్నారు.కాకినాడలో అత్యధికంగా గంటకు 358కిలోల క్యాచ్‌రేట ్నమో దైందని తెలిపారు.2022-23లో 1244గంటల పాటు నిర్వహించిన సర్వేలో సగటున క్యాచ్‌రేట్ 61.1కి లోలు పొందడం జరిగిందన్నారు.సర్వే కాలంలో అనేక రిచ్ ఫిషింగ్ గ్రౌండ్‌లు/కొత్త ఫిషింగ్ గ్రౌండ్‌లు వేర్వేరు నిమ్నతలో ఉన్నాయని వాటి వనరుల లభ్యత,జాతుల కూర్పు,వాటి పంపిణీ,సమృద్ధి విశ్లేషించబడిందని తెలిపారు.

## కమ్మవారి సేవా సమితికి లక్ష రూపాయలు అందజేసిన కన్నం



**కావలి రూరల్, మార్చి 24 ప్రభాతవార్త** కావలి పట్టణ పరిధిలోని వెంగళరావునగర్‌లో 70 లక్షల రూపాయలతో శుక్రవారం నూతనంగా ప్రారంభించిన కమ్మవారి సేవా సమితికి కావలి ముసునూరుకు చెందిన నెల్లూరు, బెంగుళూరులలో బిల్డర్ అయిన కన్నం వెంకట కృష్ణయ్య, కన్నం శ్రీధర్‌నాయుడులు లక్ష రూపాయలు అందజేశారు. కావలి పట్టణానికి చెందిన వట్టిగుంట మధుబాబుచౌదరి ఆధ్వర్యంలో లక్ష రూపాయల నగదును కమ్మవారి సేవా సమితి అధ్యక్షులు మాకినేని మాల్యాద్రినాయుడు, సభ్యులకు అందజేశారు. అనంతరం కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో కన్నం వెంకట కృష్ణయ్య చౌదరిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కన్నం వెంకట కృష్ణయ్య చౌదరి మాట్లాడుతూ కమ్మవారి సేవా సమితి నూత నంగా కావలి పట్టణంలో సొంత భవనాన్ని అందరి సహకారంతో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా వుందని తెలిపారు. ఈ భవనానికి ఫర్నిచర్‌ను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ సేవా సమితికి నా వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు కమ్మవారి సేవా సమితి సభ్యులు వేలూరు జయచంద్రనాయుడు, బొట్లగుంట శ్రీహరినాయుడు, డి.వి. రమణయ్య నాయుడు, మంచాల ప్రసాద్‌నాయుడు, మలినేని శ్రీనివాసులునాయుడు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

## విశ్వనాధరావుపేటలో పోషక వారోత్సవాలు



**బిట్రగుంట, మార్చి 24 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలో విశ్వనాధ రావుపేట 2,3, రామస్వామిపాళెం 2 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండూరు మంజుల చిరుధాన్యాల గురించి, వాటిలో పోషక విలువలపై గర్భవతులకు, తల్లులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సి.నిర్మల, సి.హెచ్.లక్ష్మి,ఝాన్సీరాణి, సహాయకులు సలోమి, శైలజ, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు బస్టాండ్ సమీపంలో కూలేందుకు సిద్దంగా వున్న విద్యుత్ స్తంభం



**కావలి, మార్చి 24 ప్రభాతవార్త** కావలి పట్టణం ఒంగోలు బస్టాండ్ సమీపంలో కెనరా బ్యాంక్ (పాత సిండికేట్ బ్యాంక్) వద్ద విద్యుత్ స్తంభం కూలిపోయే పరిస్థితులలో వుంది. ఏ నిమిషంలో ఈ విద్యుత్ స్తంభం కూలిపోతుందోనని ఆ ప్రాంతంలోని వ్యాపారస్తులు, బ్యాంక్ సిబ్బంది, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఈ విత్యుత్ స్తంభం పరిస్థితిపై విద్యుత్ శాఖ అధికారులకు ఆ ప్రాంత వ్యాపారస్తులు తెలియజేయడంతో సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆ స్తంభం అలంకారప్రాయంగా మారిందే తప్ప విద్యుత్ వైర్లు మార్చకుండా విద్యుత్ శాఖ అధికారులు కాలయాపన చేస్తున్నారు. పాత ఇనుప స్తంభం పూర్తిగా దెబ్బతిని ఒరిగిపోయి వుంది. విద్యుత్ స్తంభం ఒరిగిపోయి పక్కనే వున్న భవనానికి ఆనుకుంది.నిన్న వీచిన వర్షపు గాలికి, ఉరుములు, మెరుపులకు ఈ ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం నుండి కెనరా బ్యాంక్ భవనానికి విద్యుత్ ముప్పు జరిగి వుంటే పెద్ద ప్రమాదమే సంభవించేది. ఫలితంగా పాణనష్టం జరిగే వుండేది. ఈ స్తంభం దాదాపుగా బిల్డంగ్‌కు ఆనుకొని వుంది. రౌండ్‌దిక్లాక్ జనసంచారం కల్గిన ఈ ప్రాంతంలో ఈ కరెంటు స్తంభం వల్ల ఏ నిమిషంలోనైనా ప్రమాదం పొంచివుందన్న భావనలో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడి ఎటువంటి ఉపద్రవాలు సంభవించకముందే వెంటనే స్పందించి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి అక్కడే ఏర్పాటు చేసి వున్న సిమెంట్ స్తంభానికి విద్యుత్ వైర్లు మార్చాలని వ్యాపారస్తులు,ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అనారోగ్యపాలైన క్షవర వృత్తిదారుడికి ఆర్థిక సహాయం



**కావలి, మార్చి 24 ప్రభాతవార్త** కావలి పట్టణం వైకుంఠపురంలో నివసిస్తున్న నాయీబ్రాహ్మణ క్షవర వృత్తిదారుడు అనారోగ్యపాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఈ వార్డు మాజీ కౌన్సిలర్, వైసిపి నేత గుడ్లూరు మాల్యాద్రి శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు తాళ్ళపాళెం సత్యనారాయణ, ఒంగోలు అనిల్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్



**కొండాపురం, మార్చి 24 ప్రభాతవార్త** విద్యతోనే ఉజ్వల భవిష్యత్ వుంటుందని కొండాపురం తహశీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, ఎస్సై షేక్ ఖాజావలిలు తెలిపారు. శుక్రవారం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 32 మంది విద్యార్థులుకు పరీక్షకు కావాల్సిన సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్, ఎస్ఐలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు.మిత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు దేవినేని అశోక్ ముందుకు వచ్చి విద్యార్థులకు ఇలాంటి అవసరాలు తీర్చడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఇప్పుడు చదువుకునేందుకు అన్ని అవకాశాలు వున్నాయన్నారు. మంచి చదువులు చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం మిత్ర ఫౌండేషన్ అధ్యక్షులు దేవినేని అశోక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్ధి బాగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు, విద్యార్థులు, మిత్ర ఫౌండేషన్ సభ్యులు వేములపాటి వెంకట సురేష్, సయ్యద్ బాబు, వేములపాడు ప్రసాద్, పొదిలి రాములు పాల్గొన్నారు.

## ఉత్కంఠంగా సాగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు



**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శుక్రవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుని స్థానానికి సీహెచ్ వంశీధర్‌రెడ్డి, ఎస్‌కే సలీమ్ బాషాలు పోటీ పడ్డారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 2 గంటలకు ముగిసింది. మొత్తం ఓట్లు 42 కాగా అందులో 41 ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి. వంశీధర్‌రెడ్డికి 22 ఓట్లు రాగా సలీమ్ బాషాకు 19 ఓట్లు వచ్చాయి. దీంతో అద్యక్షుడిగా వంశీధర్‌రెడ్డి 3 ఓట్లతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి సీహెచ్ కృష్ణ ప్రకటించారు.

## క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి




**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** క్షయ వ్యాధిని ప్రభుత్వ ఆసుపత్రిలో లభించే విలువైన మందులతో పూర్తిగా నయం చేసుకోవచ్చని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారా ఈ వ్యాధిని సులువుగా నివారించుకోవచ్చున్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దిలీప్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## పొదుపు ద్వారా గృహ రుణాలు అందజేయాలి



**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు మంజూరైన పొదుపు గ్రూపు మహిళలకు గ్రూపుల ద్వారా నిర్మాణాలకు రుణాలు అందించేలా సంబంధిత వీవోఏలు,వెలుగు సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం పొదుపు రుణాల మంజూరు విషయమై సంబంధిత వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వీవోఏల వారీగా రుణాల మంజూరు విషయమై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటస్వామి, సీసీలు ఉన్నారు.

## ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి అభినందనలు



**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన పి. చంద్రశేఖర్‌రెడ్డిని వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి శాలువా, బొకేతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా ఘన విజయం సాధించి జాతీయ స్థాయిలో నెల్లూరు రెడ్‌క్రాస్‌కు మంచి పేరు తెచ్చారన్నారు. అటువంటి వ్యక్తి ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో సైతం ఘన విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మహిళా బ్యాంక్ సీఈవో జి. ప్రసాద్‌రెడ్డి, ప్రగతి యువకేంద్రం మేనేజింగ్ డైరెక్టర్ జి. భూపేష్‌రెడ్డి, మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి, ఉన్నారు.

## బార్ అసోసియేషన్ రూమ్ ఏర్పాటుకు కృషి చేస్తా



**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** కోవూరులోని కోర్టు ప్రాంగణంలో నూతన బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి తమవంతుగా కృషి చేస్తానని శుక్రవారం జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ వంశీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తన గెలుపుకు సహకరించిన ప్రతి న్యాయవాదికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేసి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలుపొందిన వంశీధర్‌రెడ్డిని సహచర న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు.

## వైభవంగా సరస్వతి పూజ



**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సరస్వతి విగ్రహానికి 10వ తరగతి విద్యార్థులు ప్రత్యేకంగా సాంప్రదాయబద్దంగా పూజల కార్యక్రమాలను రుత్వికుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేది నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయని, ఈ నేపథ్యంలో వారంతా కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పాఠశాలకు మరింత పేరు తేవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు చేపట్టిన పలు నృత్య రూపకాలు కార్యక్రమాలు అలరింపజేశాయి.

## అంగన్‌వాడీలో పిల్లల పోషణపై తల్లులకు అవగాహన

**పులిగిలపాడు(రాపూరు), మార్చి24ప్రభాతవార్త** అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల పోషణపై అవగాహనా కార్యక్రమాన్ని రాపూరు మండలంలోని రాపూరు సెక్టార్ 2 పరిధిలోని పులిగిలపాడు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో బాగంగా రాపూరు ఐసిడిఎస్‌ప్రాజెక్ట్ ఎసిడిపిఓ కె. ఉమామహేశ్వరీ ఆదేశాల మేరకు రాపూరు సెక్టార్ 2 సూపర్‌వైజర్ ఎ.ధనమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగాఎసిడిపిఓ కె. ఉమామహేశ్వరీ మాట్లాడుతూ పిల్లల పెరుగుదల స్థాయిని గురించి,బరువు,ఎత్తు తక్కువ వున్న పిల్లలకు ఇవ్వవలసినపౌష్టికాహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. మంచి పోషకాహారాన్ని పిల్లలకు అందించడం ద్వారా పిల్లలో ఎదుగుదల స్థాయినిమెరుగుపరచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనమ్మ, ఎస్‌కె.ఫాతిమా,అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రమణమ్మ,టి.విజయకుమారి,టి.భాగ్యమ్మ, కె. అంకమ్మ, ఎ.మంజుల, యం. ఉమాదేవి, గ్రామంలోని గర్భవతులు,బాలింతలు పాల్గొన్నారు.

## అధికారం మాదే



**నెల్లూరు మార్చి 24, ప్రభాతవార్త-వైద్యం** రాబోయే ఎన్నికల్లో చంద్రబాబునాయుడు అఖండ విజయంతో గెలవడం ఖాయమని, అధికారం టీడీపీదేనని, జగన్ ఆ ప్రభంజనంలో కొట్టుకుపోవడం ఖాయమని తెలుగు దేశం పార్టీ నగర నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ కువ్వారపు.బాలాజీ, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మొయినుద్దీన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పప్పుల వీధిలో రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పంచమర్తి.అనూరాధ గెలుపును పురస్కరించుకుని నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి ఆదేశాలతో బాలాజీ, ఆర్యవైశ్య నాయకులు బ్రహ్మంగుప్త, కొండా.ప్రవీణ్, ఆర్‌కేటీ.శేషయ్య, దర్శి.హరికృష్ణ బాణా సంచాను పేల్చి మిఠాయిలు ఒకరికి ఒకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో తమ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో తెలుగుదేశం ప్రభంజనం మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడాల.మధు, రామగిరి.సుబ్రమణ్యం, గంగపట్నం.శివకుమార్, బావిసెట్టి.కిరణ్, దాసరి.వేణుగోపాల్, బీసీ.బాబు, శేఖర్, కేసి.నాయుడు, కిరణ్‌చౌదరి, నారా.శ్రీని వాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 2024లో టిడిపికి పట్టం



**సంగం మార్చి 24 ప్రభాతవార్త** ఎంఎల్‌సి ఎన్నికలలో టిడిపికి చెందిన పంచుమర్తి అనురాధా గెలవడం శుభపరిణామమని టిడిపి మాజీ జిల్లా కార్యదర్శి బాణా శ్రీనివాసులురెడ్డి ప్రశంసించారు.ఇటీవల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు,ప్రస్తుతం అనురాధా విజయం ప్రజలలో టిడిపి పట్ల పూర్తి స్ధాయిలో విశేషంగా ఆదరణ పెరిగిందని అన్నారు.వైసిపి ప్రభుత్వ విదానాలతో విసిగి పోయిన ప్రజలు స్వచ్ఛందంగా తీర్పు ఇస్తున్నారని ఆయన చెప్పారు.2024లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నారా లోకేష్ చేస్తున్న యువగళానికి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. కొంతమంది వైసిపి ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేయడం ,ఎంఎల్‌సిలు గెలవడం వైసిపి నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని చెప్పారు.2024లో ప్రజలు టిడిపి కిపట్టం కట్టేందుకు నిర్ణయించుకున్నారని ఆయన తెలిపారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యంపై సమీక్షా



**సైదాపురం మార్చి 24 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సైదాపురంలోని సమైఖ్య కార్యాలయంలో ఎంపిడిఓ ఎం వెంకటేశ్వర్లు వెల్ఫేర్ అసిస్టెంట్లు ,మహిళా పోలీసులు,ఎఎన్ఎంలు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సుస్థిర అబివృద్ధి లక్ష్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న 0-5 సంవత్సరాల వయస్సు పిల్లల డేటా మహిళా పోలీసులు సర్వే చేయాలని సూచించారు. అలాగే 6-19 వయస్సు కలిగిన పిల్లలను వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు సర్వే చేయాలని తెలిపారు. అదే విధంగా ఎఎన్ఎంలు గర్బవతుల గురించి సర్వే చేయాలని చెప్పారు. ప్రతి రోజు పాఠశాలను సందర్శించి మధ్యహ్న బోజనం నాడునేడు స్కూల్‌కి సంబంధించి వివరాలను సిఆర్‌యాప్‌లో అప్‌లోడు చేయాలని వారికి సూచించారు.

## 10వ తరగతి విద్యార్థులకు పరిక్షా సామాగ్రి పంపిణీ



**ఆత్మకూరు, మార్చి24ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం కరటంపాడు హైస్కూల్లో శుక్రవారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. హైస్కూల్లో సరస్వతీ పూజ నిర్వహించి పాఠశాల ఉపాధ్యాయులు అందరూ కలసి విద్యార్థులకు అట్టలు , పెన్నులు, పెన్సిల్స్ , ఇతర వస్తువులను అందజేశారు. హాల్ టిక్కెట్లను కూడా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి ప్రధాత, గ్రామ మాజీ సర్పంచ్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటిలాగే ఈ ఏడాదికూడా 10వ తరగతిలో 525మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు తాను అందించే ప్రోత్సాహక నగదును అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాబ్జాన్, పాఠశాల కమిటీ చైర్మెన్ సర్ధార్, పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపవాస దీక్షకులకు పండ్ల పంపిణీ సంతోషదాయకం



**నెల్లూరు మార్చి 24, ప్రభాతవార్త-వైద్యం** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం పూర్తి అయిన తరువాత వారికి పండ్లను పంపిణీ చేయడం ఎంతో సంతోషదాయకమని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులు ఆనందాన్ని వ్యక్తంచేశాడు. శుక్రవారం నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో ఉన్న కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి నివాసం నుంచి మైనార్టీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి ఇందాదుల్లా ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసమంతా నీటిని పంపిణీ చేస్తున్న వారికి ఎల్లవేళలా అల్లా ఆశీస్సులుంటాయన్నారు. మహనీయుడైన మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించిన ఈ మాసంలో నెల రోజులపాటు నియమ, నిష్టలతో ముస్లింలు కఠిన ఉపవాస వ్రతాన్ని ఆచరించి అల్లా కృపకు పాత్రులవుతారన్నారు. క్రమశిక్షణ, దాతత్వం, ధార్మిక చింతనల కలయికే జీవితమని రంజాన్ మాసం గొప్ప సందేశమన్నారు. ఇలాంటి రోజుల్లో ఇందాదుల్లా తన సంపాదనలో కొంత భాగాన్ని 30రోజులు పాటు పేదలకు దాన ధర్మాలు కోసం ఖర్చు హర్షించదగ్గ విషయమన్నారు. టీడీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మొయినుద్దీన్, పసుపులేటి.మల్లిఖార్జున్, ఆకుల.హనుమంతరావు, బషీర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో రాష్ట్ర స్థాయి మెన్ అండ్ ఉమెన్, ఫిజికల్లీ ఛాలెంజ్డ్ బాడీ బిల్డింగ్ పోటీలు



**కావలి, మార్చి 24 ప్రభాతవార్త** కావలి పట్టణంలో రాష్ట్ర స్థాయిలో మెన్ అండ్ ఉమెన్, ఫిజికల్లీ ఛాలెంజ్డ్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ జగన్‌లు తెలిపారు. కావలి పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ పోటీల బ్రోచర్స్‌ను విడుదల చేసి వారు మాట్లాడారు. వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. రాష్ట్ర స్థాయిలో బాడీ బిల్డర్స్ పోటీలను 2006 సంవత్సరం నుంచి కావలిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది మే 21వ తేది కావలిలోని పిహెచ్‌ఆర్‌ఆర్ కళ్యాణమండపం (స్పందన థియేటర్)లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. కావలిలో మొట్టమొదట బాడీ బిల్డర్స్ పెద్దలైన ధర్మపురి వెంకట శేషయ్య, రేమాల వెంకారెడ్డి, కూరపాటి ఆదినారాయణరెడ్డి, దశయ్యలు ఆ నాటి యువకులతో హనుమాన్ వ్యాయామంను ప్రారంభించారని గుర్తు చేశారు. నాటి యువతకు ఉత్సాహాన్ని అందించి కావలి బావుటా మిస్టర్ ఇండియా పోటీలలో ఎగురవేయడం జరిగిందన్నారు. ఆనాటి మిస్టర్ ఇండియా ఛాంపియన్ షిప్ సాధించిన ధర్మపురి వెంకట శేషయ్య కావలి వాసి కావడం గర్వకారణమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని యువత బాడీ బిల్డింగ్ పట్ల ఆకర్షితులయ్యేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో ఈ పోటీలు కొనసాగిస్తున్నామన్నారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ పోటీలు 11 కేటగిరిలలో జరుగుతాయన్నారు. ఒక్కొక్క కేటగిరికి మూడు బహుమతులు వుంటాయన్నారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్ 30 వేలు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ మాధవరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.కె.ముజీబ్, వన్‌లైఫ్ జిమ్ అధినేత మస్తాన్‌బాషాలు పాల్గొన్నారు.

## స్మాష్ రాకెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలికి సన్మానం



**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** రాజస్థాన్‌లోని జయపూర్ చౌహాన్ స్టేడియంలో ఇటీవల జరిగిన రెండవ స్మాష్ రాకెట్ మెన్ అండ్ ఉమెన్ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర స్మాష్ రాకెట్ మహిళా డబుల్ జట్టు జాతీయ స్థాయిలో తృతీయ స్థానం సాధించింది. ఈ మేరకు ఆ జట్టులో పాల్గొని విజయంలో కీలకపాత్ర పోషించిన కోవూరు బాలికోన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, స్మాష్ రాకెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. దేవికను శుక్రవారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆమెను శాలువా, పూలమాలతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. తమ పాఠశాల స్థాయిని జాతీయ స్థాయిలో తీసుకెళ్లేలా కృషి చేసిన ఆమెను సన్మానించడం తమ కర్తవ్యంగా భావిస్తున్నామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## సరస్వతీ దేవి..చల్లగా చూడమ్మ

**గోనుపల్లి(రాపూరు),మార్చి24ప్రభాతవార్త** చదువుల తల్లి సరస్వతీ దేవి మమ్మల్లి చల్లగా చూడమ్మా అంటూ రాపూరు మండలం గోనుపల్లి గ్రామంలోని శ్రీ కరుణామయివిద్యాలయం పదవ తరగతి విద్యార్థులు శుక్రవార సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు. పెంచలకోనలోని శ్రీ భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద విద్యార్థుల కోసం గోనుపల్లి గ్రామంలో నెలకొలిపినశ్రీ కరుణామయి విద్యాలయంలో శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ నిర్వాహకులు పి.విజయ్ భరత్, పి.విజయ్ గోకుల్‌ల పర్యవేక్షణలోపాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్తాన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సరస్వతీ పూజలో పెద్ద ఎత్తున విద్యార్థినీ,విద్యార్థులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, పదవ తరగతి హాల్ టికెట్లను అమ్మవారి చిత్రపతం ముందు వుంచి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీం పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు,ఫ్యాడ్‌లు అందజేశారు. ప్రతి విద్యార్థి పరిక్షలలో జాగ్రత్తగా సమాధానాలు వ్రాసి ఉన్నత పలితాలను సాధించాలని ప్రదానోపాధ్యాయుడు కోరారు. ఈ పూజా కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయుడు మస్తాన్ రావుతో పాటు,పాఠశాల ఇన్‌చార్జ్ వెంకటరాముడు,పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## 27వ తేదీ కోనలో పెనుశిల నృసింహస్వామి హుండీల లెక్కింపు



**పెంచలకోన(రాపూరు),మార్చి24ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమంఈ నెల 27వ తేది సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయక కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ శాఖ నెల్లూరు, ఆలయ ధర్మకర్త మండలి ఛైర్మన్,మరియు సభ్యులు రెవెన్యూ అధికారులు,పోలీసు సిబ్బంది,దేవస్థానరిలీజియస్,సెక్యులర్ సిబ్బంది,దేవస్థానం మోతకాపులు,రిటైర్డ్ బ్యాంకు సిబ్బంది హుండి లెక్కింపులో పాల్గొంటారని తెలిపారు. హుండీ లెక్కింపలో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన స్వామి వారి భక్తులు వంటిపై ఎలాంటీ బంగారు,వెండి ఆభరణాలు లేకుండాపంచా,దోవతి ధరించి ఈ లెక్కింపులో పాల్గొనవచ్చని సహాయ కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

## మొక్కలు జీవకోటికి ప్రాణవాయువును అందిస్తాయి



**కోవూరు, మార్చి24 ప్రభాతవార్త :** మొక్కలు జీవ కోటికి ప్రాణవాయువును అందించడమే కాకుండా వాతావరణ సమతుల్యతకు ఎంతగానో ఉపయోగపడతాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవసాయ అభివృద్ధి శాఖ మేనేజర్ కె. కల్పన తెలిపారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం బ్యాంక్ అధికారుల ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటటమే కాకుండా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు

## ఈనెల 26 న రాపిడ్ ఓపెన్,బ్లిడ్జ్ ఓపెన్ జిల్లా స్దాయి చెస్ పోటీలు



**బుచ్చి మార్చి 26 ప్రభాతవార్త** ఈనెల 26న కోవూరులోని శ్రీచైతన్య స్కూల్ నందు రాపిడ్ ఓపెన్ మరియు బ్లిడ్జ్ ఓపెన్ జిల్లా స్దాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ కార్యదర్శి పి మస్తాన్‌బాబు తెలిపారు. ఆయా కేటగిరిలలో 2 స్దానాలలో నిలిచిన చదరంగం క్రీడాకారులు రాష్ట్రస్దాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9848147889ని సంప్రదించాలని ఆయన కోరారు.

## దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి శ్రీకారం



**కోవూరు మార్చి 24 ప్రభాతవార్త** కోవూరు ని గాందీపార్కు సెంటర్‌లో వెలసియున్న శ్రీపార్వతీ సమేత మల్లికార్జునస్వామి వారి దేవస్దానం11 వ శతాబ్దంలో నిర్మాణం చేయడం జరిగిందని ప్రస్తుతం దాతల సహకారంతో ఆలయానికి నూతన రూపు వచ్చేలా కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు కోవూరు ఎఎంసి ఛైర్మన్ పి .రాధాకృష్ణారెడ్డి తెలిపారు. కోవూరులోని ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి ప్రత్యేకంగా రంగులు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 20 సంవత్సరాల క్రితం ఈ ఆలయానికి రంగులు వేయడం జరిగిందని ప్రస్తుతం నూతన పాలక మండలి వచ్చిన తరువాత దాతల సహాకారంతో ఈ ఆలయానికి నూతనంగా రంగులు వేసే కార్యక్రమాన్ని చేపట్టం జరిగిందని అన్నారు. ఇందుకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి లక్ష రూపాయాలు,పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి 50 వేలు,నరిసింహులురెడ్డి 50 వేలు,బి .మురళీ 50 వేలు, నిరంజన్‌బాబురెడ్డి 25 వేల రూపాయాలు ప్రస్తుతం రంగులు వేసేందుకు ప్రకటించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఈ రంగులు వేసేందుకు సుమారు 5 లక్షల మేర ఖర్చు అవుతుందని రాజమండ్రికి చెందిన రాము అనే పెయింటర్ బృందం నిర్ణయించడం జరిగిందని అన్నారు. రానున్న కార్తిక మాసంలోగా ఈ ఆలయానికి నూతన రూపు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పెయింటర్ రాముకు రాధాకృష్ణారెడ్డి 50 వేలు అడ్వాన్స్‌గా అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ సురేష్,ధర్మకర్తల మండలి సభ్యులు ఎ హనుమారెడ్డి,పి .మోహన్,సుధాకర్,వంశీ,తదితరులున్నారు.

## ఇక టిడిపిదే అఖండ విజయం



**కందుకూరు,మార్చి24,ప్రభాతవార్త** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అఖండ మెజారిటీతో విజయం సాధించబోతోందని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ దివి శివరాం పేర్కొన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్ధి పంచుమర్తిఅనురాధ గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల శాసనమండలి ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్ధులు పోటీలో నిలబడి గెలుపొందడం విశేషమన్నారు. ఇక రాబోయే రోజులన్నీ తెలుగుదేశం పార్టీవేనని స్పష్టం చేశారు. తెలుగుదేశానికి 23స్థానాలు ఉన్నాయనే విషయం తెలుసుకోకుండా సజ్జల రామకృష్ణారెడ్డి టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్ధిగా ఎందుకు నిలబెట్టారని ప్రశ్నించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఇటువంటి నాయకులు ప్రజలను ఏ విధంగా పరిపాలిస్తున్నారో ఇప్పటికే ప్రజలకు అర్ధమైందన్నారు. ప్రతిపక్షాలను అణగతొక్కడం,కేసులుపెట్టడం మేధావులను చనిపోయే టట్టుగా కారణాలు సృష్టించడం పేదలపై పన్నుల భారం మోపడం,నిరుద్యోగులకు ఉపాది లేకపోవడం,అభివృద్ధి కనపడకపోవడంతో రాష్ట్ర ప్రజలు కడుపుమండి ఈ ఎన్నికల్లో వైసిపిని చావుదెబ్బకొట్టారని టిడిపి నేతలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నేతలు గోచిపాతల మోషే,షేక్.రఫీ,దామా మల్లేశ్వరరావు,ముచ్చు శ్రీను,చిలకపాటి మధు,చదలవాడ కొండయ్య,కూనం నరేంద్ర,షేక్.సలాం ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేతలు కష్టపడ్డారంటూ చంద్రబాబు కితాబు!



**కందుకూరు,మార్చి24,ప్రభాతవార్త** స్థానిక సంస్థ శాసనమండలి ఎన్నికల్లో ప్రతి తెలుగుదేశం నాయకులు బాగా కష్టపడి పనిచేశారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కితాబిచ్చారు. శుక్రవారం కందుకూరు టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల జరిగిన తూర్పు రాయలసీమ పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వివరాలను నాగేశ్వరరావు చంద్రబాబుకు వివరించారు. ఎన్నికల్లోపార్టీ నాయకులు,కార్యకర్తలు బాగా కష్టపడి పనిచేశారని నాగేశ్వరరావును చంద్రబాబు అభినందించారు. రాబోయే ఎన్నికల కోసంఇదే ఉత్సాహంతో నేతలు పనిచేయాలని చంద్రబాబు నాగేశ్వరరావును సూచించారు. కాగా ఇన్‌చార్జి నాగేశ్వరరావు ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశానికి కూడా హాజరైయ్యారు. అనంతరం అక్కడ నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన వైసిపి నేతల టిడిపిలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిన కార్యక్రమంలో కూడా నాగేశ్వరరావు హాజరైయ్యారు.

## సచివాలయానికి తాళం వేసిన సర్పంచ్




**ఉలవపాడు,మార్చి24,ప్రభాతవార్త** అధికారుల తీరుపై ఆగ్రహించిన ఆత్మకూరు పంచాయతీ సర్పంచ్ నాళం గోవిందమ్మ గ్రామసచివాలయం,రైతుభరోసా కంద్రానికి తాళాలు వేశారు. సిబ్బంది పనితీరు సరిగా లేదని విమర్శించారు. దళిత మహిళ అయిన తననుఅనుక్షణం అవమానిస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ మద్దతుతో గెలుపొందానని అయితే ఇక్కడి అధికారులుతనను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో అమలు చేయాల్సిన ప్రభుత్వ పథకాలను సైతం తన ప్రమేయం లేకుండా,తెలియకుండానే ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో రైతులకు సబ్సిడీపై ఇచ్చే ట్రాక్టర్లు,వ్యవసాయ పరికరాలు సచివాలయానికి చేరేవరకు తమకు కనీసం చెప్పకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కాగా సచివాలయానికి తాళం వేశారని విషయం తెలుసుకున్న ఎంపిడివో ఎల్.చెంచమ్మ,ఎవో తిరుమలజ్యోతి ఆత్మకూరు వచ్చారు. సర్పంచ్ గోవిందమ్మకు సర్ధిచెప్పారు. ఇకపై అన్ని విషయాలు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో తాళాలను తొలగించారు.

## పెనాల్టిలేని ఇంటిపన్ను చెల్లించండి



**బుచ్చి మార్చి 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని ప్రజలు పెనాల్టిలేని ఇంటిపన్ను చెల్లించాలని కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ అవకాశం ఈ నెల 31 వరకు మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మంచి సదావాకాశాన్ని ఇచ్చిందని ఆయన చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం పురపాలక సంఘం ఇంటిపన్ను ఇప్పటి వరకు 70 శాతం చెల్లించడం జరిగిందని ఆయన వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## జిల్లా స్థాయిలో బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థుల జయకేతనం



**వింజమూరు,మార్చి24ప్రభాతవార్త:** జాతీయ ప్రతిభా అన్వేషణ మరియు ఉపకార వేతన పరిక్షల్లో జిల్లా స్థాయిలో వింజమూరు బాలుర ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. పాఠశాల కీర్తిప్రతిష్టలను మరోసారి నలుదిశలా చాటిచెప్పారు. ప్రభుత్వం నిర్వహించిన మెరిట్‌స్కాలర్‌షిప్ టెస్ట్‌లో పాంశాలకు చెందిన 20మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరికి శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య అభినందనా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారిలో ఎస్.కె.అబ్జాల్, జి.జ్ఞాపిక, కె.పూజశ్రీరెడ్డి, వై.యశ్వంత్, కె.అజయ్, బి.గౌరీశంకర్, ఎ.నందిని, ఎం.సుస్మిత, బి.లక్ష్మి, ఎం.సుమలత, ఎస్.ంమ్యలత, టి.కోటిరత్నం, ఎస్.కె.నాహిన్ , ఎన్.అర్షిణి, ఎస్.కీర్తి, సి.హెచ్.మహేష్, ఎస్.నిఖిల్, బి.చిత్రశ్రీ, సి.హెచ్.వెంకటసుశాంత్ , జి.వెంకట సుస్మితలు ఉన్నారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బాలుర ఉన్నతపాఠశాలలోని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులందరూ ఎంతో బాధ్యతాయుతంగా విద్యార్థులకు విద్యనందిస్తూ పాఠశాల పిల్లలను తమ పిల్లలుగా భావించి సెలవుదినాల్లో కూడా విద్యార్థులకు చక్కటి బోధన చేయడంతో ఈ ఫలితాలు సాధించారన్నారు. జిల్లాస్థాయిలోనే ఇన్ని స్థానాలు సాధించడం నిజంగా ఉపాధ్యాయుల కృషేనని అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు సలాం, తిరుపాలు, మహేంద్ర, ఎం.ఎస్.రెడ్డి లను ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య అభినందించారు.

## ఎమ్మెల్యే మేకపాటి దిష్టిబొమ్మ దహనం



**వింజమూరు, మార్చి24ప్రభాతవార్త:** వింజమూరు గ్రామ పంచాయతీకార్యాలయం , పాతబస్టాండు సెంటర్‌లోని వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మను తయారు చేసి , మెడలో చెప్పుల దండ వేసి ఊరేగించి దగ్ధం చేశారు. ఈసందర్భంగా జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, వైకాపా మాజీ కన్వీనర్లు గువ్వల కృష్ణారెడ్డి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డిలు , యువ నాయకులు గణపం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈనెల 23న ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్ఆర్‌సిపికి వెన్నుపోటుపొడిచి ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశంపార్టీకి ఓటు వేయడం క్షమించరాని నేరమన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుండి నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వరకు మేకపాటి కుటుంబ సభ్యులను ఎంతగానో ఆదరించారని, అందులో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని అభిమానించిన జగనన్నను నమ్మించి వెన్నుపోటు పొడవడం దారుణమన్నారు. శేఖర్‌రెడ్డిని ఎంతగానో ఆదరించిన విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. పార్టీ చేసిన మేలును మరచి పార్టీ పతనాన్ని కోరుకోవడం ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుండి పార్టీకి వెన్నుపోటు పొడుస్తూ పార్టీకి సేవచేసిన నేతలపై అక్రమ కేసు లుపెట్టిస్తూ దోచుకోవడమే తప్ప పార్టీ మేలుకు చేసింది ఏమీ లేదన్నారు. పార్టీలోనే ఉంటూ పార్టీకి వెన్ను పోటు పొడుస్తూ నేడు టిడిపి కి ఓటు వేశారన్నారు. మేకపాటి తీరు తల్లిపాలు తాగి రొమ్ముగుద్దడమేనన్నారు. ఇలాంటి దుర్మార్గులు పార్టీలో ఉన్నంతకాలం వైసిపి కి చెడ్డపేరు వస్తుందన్నారు. పార్టీ కోసం పనిచేసిన నాయకుడు, కార్యకర్తలు రక్తాన్ని పీల్చిన నేతన్నారు. పార్టీలో పదవులను సైతం నేతలకు అమ్ముకున్న చరిత్ర మేకపాటిచంద్రశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి పనికి ఒక రేటును నిర్ణయించి ఎంతోమందిని ఏజెంట్లను నియమించుకొని పార్టీని భ్రష్టుపట్టించారన్నారు. ముఖ్యమంత్రి మేకపాటిని పార్టీనుండి సస్పెండ్ చేసి పుణ్యం చేశాడన్నారు. పార్టీని మరళా బ్రతికించాలంటే మంచి నేతను ఇన్‌చార్జ్‌గా నియమించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆనంగిరమణయ్య, పోలుబోయిన వెంకటేశ్వర్లు, దేగా వెంకటరత్నం, చిరి పిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సానం గంగిరెడ్డి, ఖాజారెడ్డి, లక్ష్మీనారాయణ, అయ్యప్ప, సురేంద్ర, అన్ని పంచాయతీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 80మంది ఎం.ఎస్.ఆర్ విద్యార్థుల ఎంపిక




**కావలి రూరల్,మార్చి24,ప్రభాతవార్తః** కావలి పట్టణంలోని ఎం.ఎస్.ఆర్ డిగ్రీ కళాశాలలో ఇ.ఒ.ఎస్ గ్లోబు ఆద్వర్యంలో శుక్రవారం విద్యార్దులకు క్యాంపస్‌ప్లేస్‌మెంట్ నిర్వహించడం జరిగింది. బ్యాంకింగ్ సెక్టారుకు సంబందించి నిర్వహించిన ఈప్లేస్‌మెంట్స్‌లో పలు కాళాశాలలనుంచి 180మంది విద్యార్దులు పాల్గొన్నారు రెండు రౌండ్లు పరీక్షలు నిర్వహించిన అనంతరం ఎం.ఎస్.ఆర్ కాళాశాలకు చెందిన 80మంది విద్యార్దులను ఎంపికచేశారు. ఎంపికైన విద్యార్దులకు కంపెని ప్రతినిదులు నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్దులను కళాశాల ప్రిన్సిపాల్ తల్లపనేని ఉమ అభినందించారు. విద్యతోపాటు ఉపాదిపాదిఅవకాశాలు విద్యార్దులకు కల్పిస్తున్నామని ఆమె తెలియజేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిరణ్,ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గొట్టిపాటి కొండపనాయుడు,సుకుమార్,అద్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కిడ్నాప్‌కేసును చేదించిన పోలీసులు



**నెల్లూరు క్రైమ్,మార్చి24,ప్రభాతవార్తః**నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో శుక్రవారం ఉదయం కిడ్నాప్‌కు గురైన నాలుగేళ్ల బాలుడిని పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గంటల వ్యవధిలోనే చేదించారు.